క్లుప్తంగా

నేడు హోం మంత్రి వనిత పర్యటన ఇలా ..

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత శనివారం ఉదయం 11 గంటలకు తాళ్లపూడి మండలం కుక్కునూరు గ్రామ సచివాలయం వద్ద నిర్వహించే మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం నాలుగు గంటలకు పట్టణంలోని సంస్కృత పాఠశాల ప్రాంగణంలో విడత ఆసరా పథకంపై నిర్వహించే లబ్ధిదారుల సదస్సులో పాల్గొంటారు. సాయంత్రం ఆరు గంటలకు కుమారదేవంలో నిర్వహించే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కొవ్వూరు: లైన్ల మరమ్మతుల కోసం శనివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వాడపల్లి విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ బి.వీరభద్రరావు శుక్రవారం తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని వాడపల్లి, తోగుమ్మి, వేములూరు, మద్దూరు, సీతపేట, మద్దూరులంక గ్రామాలకు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు నియామక ఉత్తర్వులు



అంగన్‌వాడీ కార్యకర్తలుగా నియామక ఉత్తర్వులు అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలుగా పనిచేస్తూ కార్యకర్తలుగా పదోన్నతి పొందిన ఐదుగురికి శుక్రవారం హోం మంత్రి తానేటి వనిత చేతులమీదుగా పట్టణంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. దొమ్మేరు సావరానికి చెందిన కె.నాగదేవి, తాళ్లపూడి మండలం కుక్కునూరుకు చెందిన ఆలమూరి లక్ష్మీదుర్గాప్రసన్న, అరికిరేవులకు చెందిన కె.వీరవెంకటలక్ష్మి, కుమారదేవానికి చెందిన బి.చిన్న ప్రభావతి, నందమూరుకు చెందిన సీహెచ్ మాణిక్యాంబలకు నియామక ఉత్తర్వులు అందజేశారు. సీడీపీవో డి.మమ్మీ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ పాల్గొన్నారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

దేవరపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీఓ కె.ఉమామహేశ్వరశర్మ శుక్రవారం తెలిపారు. దేవరపల్లి -1(జనరల్) , గౌరీపట్నం- 2 (జనరల్), రామన్నపాలెం -1(ఎస్సీ మహిళ), త్యాజంపూడి- 2 (ఎస్సీ మహిళ), సంగాయగూడెం-1(ఎస్సీ మహిళ), యర్నగూడెం- 1(ఎస్సీ), కురుకూరు -1 (బీసీ మహిళ) పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 4 సాయంత్రం 5 గంటల లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన తేలిన అభ్యర్థులకు 10న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, 11న అభ్యర్థుల ఎంపిక, 12న శిక్షణ ఉంటుందన్నారు. 13న అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తామని వివరించారు.

మలకపల్లిలో నేత్రదానం

తాళ్లపూడి: మలకపల్లికి చెందిన చెరుకూరి అనసూయ (85) అను వృద్ధురాలు శుక్రవారం మృతి చెందారు. ఆమె కుమారుడైన చెరుకూరి శ్రీనివాస్ తన తల్లి కార్నియాలను దానం చేశారు. రాజమహేంద్రవరంలోని గౌతమి నేత్రాలయం వైద్యులు ఈ గ్రామానికి వచ్చి ఆమె కార్నియాలను సేకరించుకుని వెళ్లారు. ఆ కార్నియాలను హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు తరలిస్తామని గౌతమి నేత్రాలయం సిబ్బంది తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కొవ్వూరు: మండలంలోని చిడిపి సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలూరు జిల్లా పోలవరం మండలం ఎల్ఎన్‌డీ పేటకు చెందిన కామన జయరామ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కొవ్వూరు నుంచి మోటార్ సైకిల్‌పై ఎల్ఎన్‌డీ పేట వెళుతున్న జయరామ్‌ను లారీ ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన జయరామ్‌ను రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ హెడ్ కానిస్టేబుల్ పీఎస్ రామకృష్ణ తెలిపారు.

పాలంగి ప్రధాన రహదారిపై చలివేంద్రం

ఉండ్రాజవరం: ప్రజల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు మై ఫ్రెండ్స్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. మండలంలోని పాలంగి గ్రామ ప్రధాన రహదారిపై గల బస్టాండ్ వద్ద శుక్రవారం ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి ముగిసే వరకూ రోజుకు 100 లీటర్ల పెరుగును మజ్జిగ చేసి వాహనదారులకు, ప్రయాణికులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. తణుకు పట్టణానికి చెందిన మై ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రంలో మొదటి రోజు మజ్జిగ పంపిణీకి తణుకు పట్టణానికి చెందిన తమరాపు మురళీకృష్ణ రూ.1000 ఆర్థిక సహాయం చేసినట్టు వారు తెలిపారు.

మిర్చి రేటు .. మరీ ఘాటు

- సాగుదారుల ఖుషీ ఖుషీ
- క్వింటాల్ రేటు రూ.50 వేలు
- ఎకరాకు 6 క్వింటాళ్ల దిగుబడి
- పచ్చళ్ల కారానికి పేరొందిన పల్లంట్ల మిర్చి



దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామం వద్ద కళ్లంలో ఎండబెట్టిన మిర్చి

దేవరపల్లి: ఈ ఏడాది మిరప సాగుదారులు ఖుషీ ఖుషీగా ఉన్నారు. మార్కెట్లో ఎండు మిర్చికి మంచి రేటు లభిస్తోంది. దాంతో లాభసాటిగా ఉందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం క్వింటాల్ ఎండు మిర్చి రేటు రూ.50 వేలు పలుకుతోంది. మొన్నటి వరకూ రూ.60 వేల ధర పలికింది. అయితే లేత కాపులు అందుకోవడంతో స్వల్పంగా తగ్గింది. ప్రస్తుతం మూడు, నాలుగు కోతల కాయల కిలో రేటు రూ.500. మిరప నాణ్యతలో గుర్తింపు పొందిన పల్లంట్ల ఎండు మిర్చిని కొనుగోలు చేసేందుకు ప్రజలు మొగ్గు కరబరుస్తున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎండు మిర్చి సీజన్ మొదలవుతుంది. దాంతో జిల్లా నలుమూలల నుంచి మహిళలు పల్లంట్ల, కురుకూరు గ్రామాలకు వచ్చి తమ కుటుంబ అవసరాల మేరకు ఎండుమిర్చిని కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో మిర్చి సాగు చేస్తున్నప్పటికీ పల్లంట్ల, కురుకూరు మిరప కాయలంలు కొనుగోలుకే చాలామంది మొగ్గు చూపుతారు. ఇక్కడ పండిన మిరపకాయలు దేశవాళీ కావడం వల్ల నాణ్యత, రుచి ఉంటుందని ప్రజల నమ్మకం. ఇక్కడ మిరపకాయలతో తయారు చేసిన కారంతో పచ్చళ్లు పడితే ఎక్కువ రోజులు నిల్వ ఉంటుందని మహిళలు అంటున్నారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచే కాకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ప్రజలు పల్లంట్ల ఎండు మిరపకాయలంటే ఎక్కువగా ఇష్టపడతారు. ఈ ప్రాంత వాసులు కూడా స్థానికంగా లభించే ఎండు మిర్చిని కొనుగోలు చేసి దూర ప్రాంతాల్లోని బంధువులకు వేసవి కానుకగా పంపిస్తారు.

150 ఎకరాల్లో మిరప సాగు

గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో మిరప సాగు జరుగుతోంది. రెండు మండలాల్లో సుమారు 150 ఎకరాల్లో రైతులు ఈ పంట సాగు చేస్తున్నారు. దేవరపల్లి మండలంలో పల్లంట్ల, కురుకూరు, లక్ష్మీపురం, దేవరపల్లి గ్రామాల్లో మిరప పండిస్తున్నారు. మండలంలోని 80 ఎకరాలు, గోపాలపురం మండలంలో 70 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నట్టు వ్యవసాయాధికారులు తెలిపారు.

దిగుబడులు ఆశాజనకం

ఈ ఏడాది మిరప దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 5 నుంచి 6 క్విటాళ్ల దిగుబడులు వస్తున్నాయని వారు తెలిపారు. ఈ ఏడాది ముదర కాపులు కొద్దిగా దెబ్బతిన్నప్పటికీ లేత కాపులు బాగున్నాయని, దీనివల్ల సాగు లాభదాయకంగా ఉందని రైతులు వివరించారు. ప్రస్తుతం ధర వీసె (1400 గ్రాములు) రూ.700 నుంచి 800 ధర పలుకుతుంది. గుల్లకాయలు రూ.400 నుంచి 550 ధర పలుకుతోంది.

ఎకరాకు రూ.2.50 లక్షల ఆదాయం

ఎకరాకు రూ.2.50 లక్షల ఆదాయం వస్తోందని రైతులు తెలిపారు. ఎకరం పొలం కౌలుకు రూ.40 వేలు, పెట్టుబడి మరొక రూ.40 వేలు అవుతోంది. పెట్టుబడులు పోను ఎకరాకు సుమారు రూ.1.50 లక్షలు నికర ఆదాయం వస్తోందని రైతులు వివరించారు. దిగుబడులు, ధర బాగుండడంతో సాగు లాభసాటిగా ఉందని రైతులు వివరించారు.

మూడు వేల ఆలయాల అభివృద్ధికి కృషి



సీతారాములను దర్శించుకుంటున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

నిడదవోలు రూరల్: మండలంలోని ఉనకరమిల్లి గ్రామంలో నిర్వహిస్తున్న సీతారాముల 81వ వార్షిక కల్యాణోత్సవాలకు ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, రాజకుమారి దంపతులు గురువారం రాత్రి హాజరై స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు వేల దేవాలయాల అభివృద్ధికి ఒక్కొక్క ఆలయానికి రూ.10 లక్షల చొప్పున అందించేందుకు దేవదాయశాఖ కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యనారాయణ, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌లను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. ఉనకరమిల్లి సర్పంచ్ పోలిరెడ్డి భారతి, స్థానిక నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాక్సిన్



పశువులకు గాలికుంటు నివారణ వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారిణి సల్మా

పెరవలి: హఠాత్తుగా పశువులకు జ్వరం సోకినా, వాటి నోట్లో గాని, గిట్టల మధ్య గాని పుండ్లు కనిపించినా గాలికుంటు వ్యాధి సోకినట్టు రైతులు గుర్తించాలని పశువైద్యాధికారిణి సల్మా పేర్కొన్నారు. గాలికుంటు వ్యాధి నివారణకు ముందస్తుగా పెరవలి మండలం ముక్కామలలో శుక్రవారం పశువులకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఏడు వేల పశువులు ఉన్నాయని, వాటన్నింటికి సరిపడా వ్యాక్సిన్ అందుబాటులో ఉందన్నారు. ఈ వ్యాక్సిన్‌ను రోజుకు ఒక ఊరి చొప్పున పశువులకు అందిస్తామన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వేండ్ర శ్రీను, ముక్కామల పశువైద్యాధికారి సోమేశ్వరి, సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపీటీసీ సభ్యుడు గండేపల్లి రామకృష్ణ, ఏహెచ్ఓలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనపై ప్రజల్లో సంతృప్తి



కుమారదేవంలో ఓ గృహిణికి చేకూరిన లబ్ధిని వివరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- కుమారదేవంలో గడప గడపకూ..

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్త పరుస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. మండలంలోని కుమారదేవం గ్రామంలో శుక్రవారం రాత్రి ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి వనిత ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన మేలును వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటికి పరిష్కార మార్గాలు చూపించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి హామీలు ఇచ్చారు. ముఖ్యమంత్రి అయ్యాక వాటిని నెరవేర్చేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజల మన్ననలూ అందుకున్నారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తినప్పటికీ కూడా అన్నీ సంక్షేమ పథకాలనూ కొనసాగించారన్నారు. అగ్ర వర్ణాల్లోని పేదలకు సైతం లబ్ధి చేకూర్చేలా పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు సుంకర సత్యనారాయణ, గన్నమని వెంకటరాజు, ఉప సర్పంచ్ గద్దె రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్లు బండి పట్టాభిరామారావు, వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, కుమారదేవం ఎత్తిపోతల పథకం రైతుసంఘం అధ్యక్షుడు గోలి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు పామెర్ల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ స్థలాలు, ఇళ్లు కేటాయిస్తాం

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- దొండపూడి, సాగిపాడు గ్రామాల్లో ఇళ్ల పట్టాల పంపిణీ



దొండపూడిలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: నియోజకవర్గంలోని అర్హులందరికీ స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణాలు చేపడతామని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు హామీ ఇచ్చారు. మండలంలోని దొండపూడిలో శుక్రవారం దొండపూడి, సాగిపాడు గ్రామాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే తలారి ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 95 శాతం హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. మిగిలిన 5 శాతం హామీల్లో ఇంటి స్థలం, ఇళ్ల నిర్మాణాలను కూడా అమలు చేస్తారన్నారు. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. దొండపూడి గ్రామంలోని సాగిపాడు కాలనీలో ఇప్పటికే స్థల సేకరణ జరిగిందన్నారు.

భీమోలులో సచివాలయ భవనం ప్రారంభం

మండలంలోని భీమోలు గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఎస్‌కె ఖాదర్‌వలీ, వెలగా శ్రీరామమూర్తి, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, సర్పంచ్ అన్నెపు వెంకటలక్ష్మి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బండారు జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కు అందజేత

మండలంలోని దొండపూడి గ్రామంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కును ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శుక్రవారం పొదుపు సంఘాల మహిళలకు అందజేశారు. రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ళ భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా భారతి

కొవ్వూరు: కొవ్వూరు బార్ అసోసియేషన్ తొలి మహిళా అధ్యక్షురాలిగా బొబ్బా (ఇమ్మణ్ని) భారతి విజయం సాధించారు. బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. మొత్తం 152 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్షురాలిగా భారతి 104 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ప్రస్తుతం ఆమె ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో ఏపీపీగా పనిచేస్తున్నారు. గత 28 ఏళ్లుగా భారతి న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. ప్రధాన కార్యదర్శిగా తక్కెళ్ల చిట్టిబాబు 123 ఓట్ల మెజార్టీతో గెలిచారు. జాయింట్ సెక్రటరీగా మెరిపో గోపి, ఉపాధ్యక్షుడిగా కోమటి గోపాలకృష్ణ, కోశాధికారిగా వీరంశెట్టి రాజా వరప్రసాద్, లైబ్రరీ కార్యదర్శిగా యాదాటి ప్రకాశరావు, మహిళా ప్రతినిధిగా వరసాల రాజేశ్వరి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పూలమాలలతో ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నీరుకొండ సూర్యనారాయణ, వీవీ సుబ్బారావు, వర్రే నాగ మురళి, యాగంటి చలపతిరావు, పిల్లలమర్రి మురళీకృష్ణ, ఎండీవీ ప్రసాద్, ఏలూరి గోపాలకృష్ణ, దుగ్గిరాల తాతారావు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బా భారతి



ఎం.రవికుమార్

నిడదవోలు అధ్యక్షుడిగా రవికుమార్

నిడదవోలు రూరల్: నిడదవోలు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది ఎం.రవికుమార్ ఘన విజయం సాధించారు. నిడదవోలు కోర్టు ఆవరణలో ఎన్నికల అధికారులు కొండేపాటి వెంకట శ్రీను, సీహెచ్ చిట్టిబాబు పర్యవేక్షణలో బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా రవికుమార్, ఉపాధ్యక్షుడిగా వెలగన లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా డేగపాటి మహేష్, సంయుక్త కార్యదర్శిగా ముప్పిడి మంగయ్య, కోశాధికారిగా గుమ్మపు గాబ్రియేల్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని బార్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- అవంతీ ఫౌండేషన్ సహకారంతో నిర్మించిన వాటర్ ప్లాంట్ ప్రారంభం



గౌరీపట్నంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దేవరపల్లి: వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. అవంతీ ఫౌండేషన్ సహకారంతో మండలంలోని గౌరీపట్నంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు శుద్ధిచేసిన తాగునీటి సరఫరాకు అవంతి ఫౌండేషన్ 10 మినరల్ వాటర్ ప్లాంట్లు మంజూరు చేసిందన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని బోర్లు, ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించినట్టు చెప్పారు. అడిగిన వెంటనే వాటర్ ప్లాంట్లు మంజూరు చేసిన అవంతీ ఫౌండేషన్ అధినేత అల్లూరి ఇంద్రకుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాయి అన్నపూర్ణ, ఉప సర్పంచ్ ఆండ్రు రమేష్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు జి.అచ్యుతరావు తదితులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మార్కొండపాడులో పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల ప్రదర్శనలో అంగన్‌వాడీ సిబ్బంది

చాగల్లు: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ డీవీఎస్ఆర్ఎస్ కుమారి అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మార్కొండపాడు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా అధిక పోషక విలువలు, చిరుధాన్యాలు కలిగిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఊనగట్ల సొసైటీ ద్వారా రైతులకు సేవలు



ఊనగట్ల సొసైటీ మహాజన సభలో మాట్లాడుతున్న అధ్యక్షుడు ఆత్కూరి దొరయ్య

చాగల్లు: ఊనగట్ల సొసైటీ ద్వారా రైతులకు విస్తృత సేవలను అందిస్తున్నామని ఆ సొసైటీ అధ్యక్షుడు ఆత్కూరి దొరయ్య అన్నారు. ఊనగట్ల సొసైటీ మహాజన సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరయ్య మాట్లాడుతూ సహకార సంఘ వ్యాపార లావాదేవీల్లో వచ్చిన ఆదాయాన్ని రైతులకు అందిస్తున్నామన్నారు. 2023–24 అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు కండిబోయిన నాగార్జున, మెరిపో వరలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన పురుగు మందులు వాడాలి

నిడదవోలు రూరల్: రైతులంతా నాణ్యమైన పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు చేయాలని మండలంలోని శంకరాపురం సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు రైతులకు సూచించారు. ఆ సొసైటీ మహాజన సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రబీలో ప్రైవేటు కంపెనీల డీలర్ల వద్ద కొనుగోలు చేసిన పురుగు మందులను వాడితే సుమారు 400 ఎకరాల్లోని పంటకు వివిధ తెగుళ్ల సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. సొసైటీల ద్వారా ఎరువులు, పురుగు మందులను రాయితీపై అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ గిద్దా వెంకటేశ్వరనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉప్పులూరి రామకృష్ణ, కాల్దారి శ్రీను, కత్తినొక్కుల మురళీకృష్ణ, యామన మాణిక్యాలరావు, బెజవాడ గంగాధర్, సొసైటీ కార్యదర్శి పి.ప్రకాశరావు రైతులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు ప్రజా సహకారం అవసరం

ఉండ్రాజవరం: ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నివారణ సాధ్యమని తణుకు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. ఉండ్రాజవరం పీహెచ్‌సీ పరిధిలోని చివటం గ్రామంలో అమలవుతున్న ఫ్రైడే డ్రైడే, మస్కిటో లార్వా డెన్సిటీ కార్యక్రమాన్ని ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దోమల నియంత్రణ లక్ష్య సాధనలో ప్రజలను భాగస్వాములను చేయడం అత్యంత అవసరమన్నారు. ప్రజల భాగస్వామ్యం లేనిదే మనం విజయం సాధించలేమన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కె.కృష్ణవేణి, వీఆర్వో ఎ.రాజశేఖర్, ఆరోగ్య కార్యదర్శి డి.సూర్యకుమారి, హెల్త్ అసిస్టెంట్ ఎం.సుబ్రహ్మణ్యం, కె.విజయకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి నిరోధకులు టీడీపీ నాయకులే

తాళ్లపూడి: తెలుగుదేశం నాయకులు వేగేశ్వరపురం అభివృద్ధికి ఆటంకం కలిగించడమే గాకుండా తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆ పంచాయతీ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. వేగేశ్వరపురంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో టీడీపీ నాయకుడు కైగాల శ్రీనివాసరావు చేసిన ఆరోపణలను వారు ఖండించారు. గ్రామంలోని ఆలయాలు, దేవృక్షతో రాజకీయం చేస్తూ కోర్టులను ఆశ్రయించడం, సమాచార హక్కు చట్టం పేరుతో అధికారులను ఇబ్బంది పెట్టడం కైగాల సోదరులకు అలవాటుగా మారిందన్నారు. 26 ఏళ్లుగా ఎత్తిపోతల పథకం అధ్యక్షుడిగా కొనసాగుతూ రైతులతో సమావేశాలు నిర్వహించకపోగా, జమాఖర్చులు సైతం చూపడం లేదన్నారు. కోర్టులో కేసు వేసి ఎత్తిపోతల సంఘానికి ఎన్నికలు జరగకుండా చేశారన్నారు. ధైర్యం ఉంటే ఎన్నికల్లో పోటీ చేయాలన్నారు. రోడ్డు ఆక్రమణలను తొలగిస్తుంటే దానిపై కూడా గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేశారన్నారు. ఉప సర్పంచ్ మదన్, ఎంపీటీసీ సభ్యుడు రావిపాటి లక్ష్మణరావు, నాయకులు శీర్ల బ్రహ్మానందం, సూలా పోశియ్య, తైలం జైయేసు, జనసేన నాయకుడు తైలం పోశియ్య తదితరులు పాల్గొన్నారు.

మీ పనులపై సమాచారం ఇవ్వరా?

ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులపై ఎంపీపీ అసంతృప్తి

పెరవలి: ప్రకృతి వ్యవసాయాధికారుల కార్యకలాపాలపై మండలంలోని ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఉండడం లేదని ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అదీగాక మండల స్థాయి అధికారులు ఎవరో తెలియకుండా ప్రకృతి వ్యవసాయ విభాగం పనిచేస్తోందని ఆయనన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులతో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం పొలాల్లో ఏయే కార్యక్రమాలు నిర్వహిస్తుందో తెలిస్తే, వారికి ప్రజాప్రతినిధులు తమ వంతు సహకారం అందిస్తారన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విభాగం మండల అధికారిణి బుజ్జి మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాల్లో తమ శాఖ అధికారులు తమకు నిర్దేశించిన టార్గెట్లను పూర్తి చేస్తున్నారన్నారు. ఇక నుంచి అన్ని వివరాలు స్థానిక ప్రజాప్రతినిధులకు, మండల స్థాయి అధికారులకు తెలియజేస్తామని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ రమేష్, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయంలో విశేష పూజలు

చాగల్లు: శ్రీరామనవమిని పురస్కరించుకుని స్థానిక శివాలయం వద్ద గల షిర్డీ సాయిబాబా ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన నాగవీరవెంకట సత్య సుభాష్ దంపతులచే సాయిబాబాకు వేద పండితులు లింగాల శ్రీనివాస్‌శర్మ పర్యవేక్షణలలో అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు.